క్లుప్తంగా

సీతారామచంద్రులకు విశేష పూజలు



స్వామి వారికి అభిషేకం నిర్వహిస్తున్న పూజారులు

మండపేట: స్థానిక బురుగుంట చెరువు సమీపంలో కొలువైన సీతారామచంద్ర స్వామి వారికి శుక్రవారం విశేష పూజలు జరిగాయి. ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయ అర్చకుడు వరదాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మల్లిపూడి గణేశ్వరరావు, మల్లిపూడి కొండయ్య కుటుంబ సభ్యులు స్వామి వారి పూజల్లో పాల్గొన్నారు. చుట్టుపక్కల వీధుల్లోంచి భక్తులు వచ్చి తమ గోత్ర నామాలతో పూజలు చేయించుకున్నారు. పూజల అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడిగా అర్జున్



ఉండ్రాజవరపు అర్జున్

మండపేట: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ పట్టణ శాఖ అధ్యక్షుడిగా ఉండ్రాజవరపు అర్జున్‌ను నియమిస్తూ శాసనమండలి సభ్యుడు, ఆ పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట త్రిమూర్తులు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ పట్టణంలో ఎస్సీల సంక్షేమానికి, పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు, తోట త్రిమూర్తులును అత్యధిక మెజారిటీతో గెలిపించడానికి ఎస్సీలందరూ కృషి చేయాలని కోరారు.

సెలవు రోజుల్లోనూ తరగతుల నిర్వహణ

మండపేట: సెలవు దినాల్లో కూడా పనిచేస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ శుక్రవారం డిమాండ్ చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలుచోట్ల ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజుల్లో కూడా ప్రైవేట్ విద్యా సంస్థలు నడుస్తున్నాయన్నారు. ఒకపక్క ఎండలు మండిపోతుంటే, పరీక్షల నెపంతో విద్యార్థులను తరగతులు నిర్వహించడం తగదన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం ప్రైవేట్ విద్యాసంస్థలను మూయించి వేసామన్నారు. దీనిపై జిల్లా విద్యా శాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండపేట నియోజకవర్గ కన్వీనర్ భాను కార్తిక్, కొత్త పేట నియోజకవర్గం కన్వీనర్ సందీప్, అమలాపురం కన్వీనర్ సతీశ్ , సుహాస్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో జుమ్మతుల్ విదా



ఇఫ్తార్ విందులో పాల్గొన్న పిల్లి సూర్యప్రకాష్, మసీదు పెద్దలు

రామచంద్రపురంరూరల్: రామచంద్రపురం మండలం ద్రాక్షారామలో రంజాన్ నెలలోని ఆఖరి శుక్రవారం (జుమ్మతుల్‌విదా)ను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ప్రత్యేక నమాజ్ (ప్రార్థన) చేసుకున్నారు. ఇఫ్తారి, సహారి ఇచ్చిన వారి గురించి దువా(వేడుకలు) చేశారు. శాంతి, సౌభాగ్యాలకు ఈ రంజాన్ మాసం దోహదపడుతుందని వక్తలు కొనియాడారు. రంజాన్ మాసంలో సలహాలు, సూచనలు, మజ్లిస్‌లు, నమాజ్ చేయిస్తున్న మౌలానామీర్జా అస్కరి హుస్సేన్ శుక్రవారం ప్రసంగించారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న సూర్యప్రకాష్

మండలంలోని ద్రాక్షారామలో రంజాన్ మాసం సందర్భంగా జామియా జఫ్తారియ మసీద్‌లో నిర్వహించి ఇఫ్తార్ విందులో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ పాల్గొన్నారు. స్థానిక మసీదు పెద్దలు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఇఫ్తార్ విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మసీదు గురువు, ముస్లిం పెద్దలు మౌలానా అస్కరి హుస్సేన్, అబ్దుల్ ఘని, అలీ హుస్సేన్, అహ్మద్ హలీషా, జాఫర్, నాయకులు తోట బాబులు, కోటిపల్లి అబ్బు, వైస్ సర్పంచ్ బుచ్చిరాజు, కర్రి అబ్బు, నున్న కళ్యాణ్, మున్సిపల్ కోఆప్షన్ మస్తాన్, నియోజకవర్గ నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి సాయం

అంబాజీపేట: ఇటీవల పుల్లేటికుర్రు శివారు వాజ్‌పేయి కాలనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి అమలాపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయం అందజేశారు. బాధితుడు గాడ నాగబాబుకు రూ.12 వేల నగదు, బెడ్‌షీట్లు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా గవర్నర్ లయన్స్ వేలూరి సూర్యనారాయణ, బి.హనుమంతరావు, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ సరళతరం

- చివరి దశకు చేరుకున్న రబీ సాగు
- ముందస్తుగా కొనుగోలు ఏర్పాట్లు పూర్తి
- గిట్టుబాటు ధర ప్రకటించి ప్రభుత్వం
- రెండు నియోజకవర్గాల్లో 99,583 ఎకరాల్లో సాగు
- 3.30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనా



కపిలేశ్వరపురంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ రాజరాజేశ్వరి

కపిలేశ్వరపురం: ఈ ఏడాది రబీ వరిసాగు సజావుగా సాగింది. ప్రభుత్వం తీసుకున్న ముందస్తు జాగ్రత్తల కారణంగా సాగునీటి సరఫరాలో ఎలాంటి సమస్యలూ తలెత్తలేదు. ధాన్యం కొనుగోలు ఏర్పాట్లను సైతం ముందస్తుగా పూర్తి చేశారు. రైతు ఆసక్తి మేరకు ప్రభుత్వ గిట్టుబాటు ధరకు రైతుభరోసా కేంద్రాల్లో అమ్ముకోవచ్చు. అంతకంటే అధిక ధరకు బయట కొనేవాళ్లకు సైతం రైతు తన ధాన్యాన్ని అమ్ముకునే వెసులుబాటు కల్పించింది. రబీ సాగు ప్రక్రియ చివరి దశకు వచ్చిన నేపథ్యంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై ఈ కథనం....

రెండు నియోజకవర్గాల్లో వరిసాగు ఇలా.....

రెండు నియోజకవర్గాల్లో సాగు రకాలివీ...

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో రబీలో ఏటా అత్యధిక శాతం బొండాలు రకం వరి వంగడాన్ని సాగు చేస్తున్నారు. అదే ఒరవడి ప్రకారం ఈ ఏడాది 90 శాతం ఎంటీయూ 3626 (బొండాలు) రకం సాగు చేస్తున్నారు. మిగిలిన 10 శాతంలో 1121 (శ్రీధృతి), 34449 ఆరెన్నార్ రకాలను సాగు చేస్తున్నారు. ప్రాథమికంగా ఎకరాకు 55 బస్తాలు దిగుబడి అంచనా వేసున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలిలా...

జిల్లాలోని 377 ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను చేపడుతున్నట్టు జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజరు ఎల్లారావు ఇప్పటికే ప్రకటించారు. ఆయన చేతుల మీదుగా ఈ నెల 2న మండపేట, కేశవరం, సహకార సంఘాల వద్ద ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించారు. మండపేటలో మరో 15 కేంద్రాలను ప్రారంభించనున్నట్టు ప్రకటించారు. మిగిలిన మండలాల్లోని ఆర్‌బీకేల్లో ఇప్పటికే కొనుగోలుకు ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు.

ధాన్యం గిట్టుబాటు ధరలిలా

జిల్లాలో 4.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలన్నది లక్ష్యంగా నిర్దేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగిసిన 21 రోజుల లోగా సొమ్మును రైతు ఖాతాకు జమ చేసేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు సాధారణ రకం ధాన్యం 100 కిలోల క్వింటాల్‌కు రూ.2,183,75 కిలోల బస్తా రూ.1,637, 40 కిలోలకు రూ.873, ఎ గ్రేడు రకం 100 కిలోల క్వింటాల్‌కు రూ.2,203, 75 కిలోల బస్తా ధర రూ.1,652, 40 కిలోలకు రూ. 881గా నిర్ణయించారు.

మండలం	వరిసాగు (ఎకరాలు)	ఆర్బీకేల సంఖ్య	ధాన్యం దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నులు)
మండపేట	16,296	24	65,000
రాయవరం	14,509	19	55,000
కపిలేశ్వరపురం	15,758	19	61,000
రామచంద్రపురం	18,120	21	69,000
కె.గంగవరం	15,444	23	58,000
కాజులూరు	19,456	23	72,000
మొత్తం	99,583	129	3,80,000

2022–23 సంవత్సరం కన్నా ఈ ఏడాది గిట్టుబాటు ధరను రూ. 143కు పెంచారు.

కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు ఇలా

ప్రతి ఎకరానూ ముందస్తుగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఈ క్రాప్ నమోదు ప్రక్రియను సమర్థవంతంగా ఆర్బీకే వ్యవసాయ సహాయకులు పూర్తి చేశారు. మ్యాపింగ్ చేసేందుకు రైసు మిల్లులను ఎంపిక చేశారు. హమాలీలు, వాహనాలను సిద్ధం చేస్తున్నారు. గోనె సంచులు, హమాలీలు, రవాణా వాహనాలు ఏర్పాటు చేస్తున్నారు. సందేహాలుంటే నివృత్తి చేసుకునేందుకు జిల్లా కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. 83094 32487, 94416 92275 నంబర్లకు ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకూ ఫోన్లో సంప్రదించే అవకాశాన్ని కల్పించారు.

స్వేచ్ఛగా విక్రయించుకోవచ్చు



రబీ పంట తాలూకు ధాన్యాన్ని రైతు తన ఆసక్తి మేరకు విక్రయించుకునే వీలును ప్రభుత్వం కల్పించింది. గిట్టుబాటు ధర పై ఇప్పటికే క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాం. కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోలు ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు చేశాం. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఉన్నతాధికారులు ఆదేశాలుపై కేంద్రాల నిర్వహణా సామర్థ్యాన్ని పెంచాం.

– కేవీఎస్ రమేష్‌కుమార్, ఏవో, కపిలేశ్వరపురం మండలం

దీనికి ఎలక్షన్ కోడ్ వర్తించదా?



అముజూరులో రంగులతో ఉన్న కాంగ్రెస్ పార్టీ స్తూపం

కె.గంగవరం: మండల ంలోని అముజూరు ప్రధాన రహదారి పక్కనే ఉన్న కాంగ్రెస్ పార్టీ జెండా స్తూపానికి రంగులు కనిపించకుండా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. సచివాలయానికి పక్కనే ఉన్నా.. కోడ్ అమల్లోకి వచి, వారంపైనే గడుస్తున్నా రెవెన్యూ, సచివాలయ సిబ్బందికి మాత్రం ఈ కాంగ్రెస్ పార్టీ దిమ్మ కనబడలేదు. దాని పక్కనే ఉన్న టీడీపీ స్తూపానికి తెల్లపేపర్లు అంటించారు కానీ కాంగ్రెస్ పార్టీ స్తూపానికి మాత్రం ఒదిలేశారు.

ఇది చూసిన పలువురు ఎలక్షన్ కోడ్‌ను వివక్ష లేకుండా పక్కాగా అమలు చేయాలని కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీలో 50 మంది చేరిక



కపిలేశ్వరపురంలో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: గ్రామంలోని అగ్నికుల క్షత్రియ, శెట్టిబలిజ, కాపు సామాజిక వర్గాలకు చెందిన 50 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమక్షంలో వారంతా పార్టీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్సీ తోట పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు సేవ చేసుకునే అవకాశం వైఎస్సార్ సీపీ ద్వారానే సాధ్యమన్నారు. చేరిన వారందరినీ కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. పార్టీలో చేరిన వారిని ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు, ఏఎంసీ చైర్మన్ నక్కా సింహాచలం, ఎంపీటీసీ సభ్యులు శీలం భాస్కరరావు, గొల్లపల్లి సోనియా, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శీలం గోవింద్, గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కట్టా మురళి, పీతల శ్రావణ్ కుమార్ అభినందించారు. కార్యక్రమంలో మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు అరదాని శ్రీదేవి, పిప్పర సంపతరావు, శివకుమార్, అంగాని నూకరాజు, కొరిపెల్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజల వద్దకే సంక్షేమ పాలన

వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాష్



అండ్రంగిలో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్

కాజులూరు: రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల వ్యవస్థతో ప్రజల వద్దకే సంక్షేమ పాలన అందుతుందని రామచంద్రపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. మండలంలోని అండ్రంగిలో శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకులు ఇంటింటా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సూర్యప్రకాష్ మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ కార్యాలయంలో చేయించుకోవలసిన ఏ చిన్న పనికైనా ప్రజలు జిల్లా, మండల కేంద్రాలకు వెళ్లి రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి అన్ని శాఖల అధికారులను గ్రామ స్థాయిలో అందుబాటులో ఉంచారన్నారు. ప్రభుత్వం నుంచి జరగాల్సిన ప్రతీ పని వలంటీర్ల ద్వారా సచివాలయ ఉద్యోగులే ప్రజల వద్దకు వచ్చి పూర్తి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తూ గత టీడీపీ హయాం నుంచి పాతుకుపోయిన దళారీ వ్యవస్థకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెల్లుచీటీ పలికారన్నారు. గత పాలనలో అరకొరగా వచ్చే ప్రభుత్వ పథకాలు సైతం జన్మభూమి కమిటీ సిఫారసుల మేరకు టీడీపీ కార్యకర్తలకే ఇచ్చేవారని సామాన్యులకు న్యాయం జరగాలంటే దళారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. అయితే జగనన్న ప్రజాసంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలన్నీ పారదర్శకంగా అమలు చేస్తున్నారని పార్టీలు, వర్గవిభేదాలకు తావివ్వకుండా ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా వివిధ పథకాల లబ్ధి మొత్తం నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతుందన్నారు. తాము అధికారంలోకి వస్తే గత పాలన విధానాలే అమలు చేస్తామని తమ కార్యకర్తలు చెప్పిన వారికే పథకాలు ఇస్తామని టీడీపీ నేత లోకేష్ బహిరంగంగా ప్రకటించటం వారి నిరంకుశ ధోరణికి అద్దం పడుతుందన్నారు. ప్రజలు వాస్తవాలు తెలుసుకుని రానున్న ఎన్నికల్లో టీడీపీ కూటమికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెదిరెడ్డి నాగసుజాత, ఎంపీటీసి మట్టా వెంకటరమణమ్మ, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్రైడే..

- ఉష్ణ తాపానికి తోడు పెరుగుతున్న ఉక్కపోత
- అప్రకటిత కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్న రోడ్లు



రాయవరంలో ఉదయం 11 గంటలకే కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్న ప్రధాన రహదారి

రాయవరం: భానుడు రోజు రోజుకూ తన భగభగలు పెంచుకుంటూ పోతున్నాడు. మార్చి నుంచే సూరీడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నా.. ఏప్రిల్ మొదటి వారంలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే వాతావరణ శాఖ ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరికలు జారీ చేసింది. ఏప్రిల్ మొదటి వారంలోనే ఇలా ఉంటే మే నెలలో ఎండలు ఎలా ఉంటాయోనని ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఎండలకు తోడు ఉక్కపోత ప్రజలను ఇబ్బందికి గురి చేస్తోంది. వేసవి తాపాన్ని తీర్చుకునేందుకు చల్లని పానీయాలతో సేదతీరుతున్నారు.

అల్లాడుతున్న వృద్ధులు, చిన్నారులు

ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. మధ్యలో మబ్బులు ఏర్పడినా వేడి వాతావరణం చోటు చేసుకుంది. శుక్రవారం వాతావరణం యాప్‌లో 40 డిగ్రీల గరిష్ఠ, 24 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం ఐదు గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండగా, సాయంత్రం వేళల్లో కూడా వేడి వాతావరణం ప్రజలను ఇబ్బందులకు గురి చేసింది. ఎండ వేడికి ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఎండవేడిని తట్టుకునేందుకు టోపీలు, గొడుగులు వినియోగిస్తున్నారు.

శీతల పానీయాలకు గిరాకీ

భానుడి భగభగల నుంచి కొంతైనా ఉపశమనం పొందేందుకు శీతల పానీయాల వైపు మొగ్గు చూపుతున్నారు. చల్లదనం కోసం శీతల పానీయాలు, పలు రకాల పళ్ల రసాల వైపు ప్రజలు ఆసక్తి చూపుతుండడంతో రహదారుల వెంబడి ఎక్కడ చూసినా కొబ్బరి బొండాలతో పాటుగా, చెరకు రసం, శీతల పానీయాల దుకాణాలు, జ్యూస్ సెంటర్లు హడావిడి కన్పిస్తుంది. లస్సీ, బొప్పాయి, ద్రాక్ష, ఫైనాపిల్, పుచ్చకాయ తదితర రకాల పండ్ల రసాల వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. ఉదయం 11 గంటలకే ప్రధాన రహదారులు ఎండ తీవ్రత కారణంగా నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే అప్రకటిత కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తుంది.

సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపిద్దాం



బ్రహ్మపురిలో కాపు సామాజికవర్గ నాయకులను కలసిన వైఎస్సార్ సీపీ కాపు, బీసీ సంఘం నాయకులు

కె.గంగవరం: పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమం అందాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకోవాలని, టీడీపీ వస్తే ప్రజలను దోచుకుతినేందుకు జన్మభూమి కమిటీలు వస్తాయని నియోజకర్గ బీసీ నాయకులు నరాల ఏడుకొండలు, పంపన సుబ్బారావు, కాపు సామాజిక వర్గ నాయకులు అడపా నారాయణస్వామి, సాదా వెంగళరావు తదితరులు అన్నారు. మండలంలోని మసకపల్లి, బ్రహ్మపురి, తాళ్లపొడు, భట్లపాలిక గ్రామాల్లోని పలు సామాజిక వర్గాలకు చెందిన కుల సంఘ పెద్దలను శుక్రవారం వారు కలిశారు. వారు మాట్లాడుతూ కులం, మతం పార్టీ భేదాల్లేకుండా టీడీపీ, జనసేన పార్టీల వారికి కూడా సంక్షేమాన్ని అందించిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా పేదలు ఏ లబ్ధి కావాలన్నా జన్మభూమి కమిటీలకు ముడుపులు చెల్లించుకోవాల్సి వచ్చేదని, కానీ జగనన్న ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ 58 నెలల్లో అర్హులైతే చాలు సంక్షేమం ఇంటి గుమ్మంలోకే వచ్చేలా సీఎం జగన్ ప్రజారంజక పాలన అందిస్తున్నారని తెలిపారు. సంక్షేమ ప్రభుత్వం కావాలో, జన్మభూమి కమిటీలు కావాలో ప్రజలకు ఇప్పటికే ఆలోచించి సిద్ధంగా ఉన్నారని అన్నారు. కాబట్టి ప్రజలంతా తమ విలువైన ఓటును ఎమ్మెల్యే అభ్యర్థిగా పిల్లి సూర్యప్రకాష్‌కు ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కి ఓటేయాలని కోరారు. యువజన నాయకులు జత్తుక శ్యాంప్రసాద్, సర్పంచ్‌లు పిల్లి రాంబాబు, పంపన సత్యానందం, ఎంపీటీసీలు కొప్పిశెట్టి లక్ష్మణ్, కోట సత్తిబాబు, నాయకులు వాసంశెట్టి సూరిబాబు, నానాపరపు శ్రీనివాస్, చీకట్ల గోపాలం, అయినవిల్లి అబ్బు, పిల్లి శ్రీను తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

రామచంద్రపురం: సార్వత్రిక ఎన్నికల నియమావళి అమలులో ఉన్న కారణంగా రామచంద్రపురం పోలీస్ సబ్‌డివిజన్ పరిధిలో సెక్షన్ 30 అమలులో ఉందని మోడల్ కోడ్ ఆఫ్ కాండక్టు నిబంధనల ప్రకారం ముందస్తు అనుమతులు లేకుండా సభలు సమావేశాలు, ఊరేగింపులు, ర్యాలీలు జరపడానికి వీలు లేదని, అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలని రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సబ్‌డివిజన్ పరిధిలో రామచంద్రపురం టౌన్, ద్రాక్షారామ, పామర్రు, మండపేట టౌన్, మండపేట రూరల్, అంగర, రాయవరం పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఉన్న ప్రాంతాల్లో ముందస్తు అనుమతులు లేకుండా సభలు సమావేశాలు ఊరేగింపులు నిర్వహించరాదన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రచారం నిమిత్తం నాయకులు గాని, కార్యకర్తలు గానీ సభలు సమావేశాలు ప్రచారాలు జరుపుకొనేందుకు సంబంధిత అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల వద్ద నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా నిర్దేశించిన కాలవ్యవధిలో పొందాల్సి ఉందన్నారు. ప్రైవేటు కార్యక్రమాలకు ఇతర మతప్రచారాలు, జాతరలు, ఊరేగింపులు వంటివి జరపడానికి డీఎస్పీ కార్యాలయంలో ముందుస్తు అనుమతి తప్పని సరిగా పొందవలసి ఉంటుందన్నారు. రాజకీయ పార్టీల ప్రచార సభలు సమావేశాలు, ఊరేగింపులు, ఇతర ప్రైవేటటు కార్యక్రమాల్లో డీజే సౌండ్ సిస్టమ్‌లను అనుమతి ఇవ్వరని, ఆయా కార్యక్రమాలలో డీజే సౌండ్ సిస్టమ్‌లను ఉపయోగించిన ఎడల వాటిని పోలీస్‌వారు స్వాధీనం పరచుకుని బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని డీఎస్పీ పేర్కొన్నారు. పై విషయాలను అందరూ గమనించి శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న చర్యలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

జగ్జీవన్‌కు ఘన నివాళి



మండపేటలో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పట్టాభిరామయ్య తదితరుల నివాళి



వైఎస్సార్‌సీపీ మండపేట ఆఫీసులో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



కపిలేశ్వరపురంలో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు, చిన్నారులు

మండపేట: భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. స్థానిక 8వ వార్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఆ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగ్జీవన్ జయంతి వేడుకల్లో అంబేడ్కర్ కోనసీమ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభిరామయ్యచౌదరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జగ్జీవన్ చిత్ర పటానికి వేగుళ్ల, 7 వ వార్డు కౌన్సిలర్ సవరపు సతీష్, పార్టీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఎస్సీ నాయకులు కొల్లి వరలక్ష్మి, మందపల్లి సుధాకర్, ఉండ్రాజవరపు అర్జున్, కొడమంచిలి భాస్కరరావు, గుడిమెట్ల శ్రీను, కొత్తేలు నాగేశ్వరరావు, మందపల్లి సంజీవరావు, మడికి ఆనందరావు, పాలమాల సత్తిబాబు, దార్ల అబ్రహాం తదితరులు పాల్గొన్నారు.

యువనేత పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో..

స్థానిక విజయలక్ష్మీ నగర్లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి ఆ పార్టీ యువనేత తోట పృథ్వీరాజ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చెర్మన్ పిల్లి గణేశ్వరరావు, పార్టీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిలర్లు సవరపు సతీష్, మందపల్లి రవికుమార్, పిల్లి శ్రీనివాస్, మారిశెట్టి సత్యనారాయణ, శెట్టిబలిజ సంఘం పట్టణ శాఖ అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, ఎస్సీ, బీసీ నాయకులు పాల్గొన్నారు.

మండలంలోని ఏడిద గ్రామంలోని ఎస్సీ పాతపేటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తాతపూడి రాజేష్ ఆధర్యంలో ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవన్‌రామ్ ఫ్లెక్సీకి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు పైడిమళ్ల బాబ్జీ, ఉండ్రాజవరపు అబ్బులు, పల్లేటి సుబ్బు, దుళ్ల రాజు, గోరింక తరుణ్, పల్లేటి సందీప్, దొండపాటి మోడల్, తాతపూడి అజయ్,పైడిమళ్ల గణ, ఉండ్రాజవరపు చందు, మంగపల్లి బాబి, అభి పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: దళిత జనోద్ధారకుడు, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండలానికి చెందిన పలువురు దళిత నాయకులు అన్నారు. జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కపిలేశ్వరపురం, అంగర, పడమర ఖండ్రిక, అచ్యుతాపురం, వడ్లమూరు, వల్లూరు, గ్రామాల్లోని జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద నివాళి అర్పించారు. కపిలేశ్వరపురంలో మల్లిపూడి శివకుమార్, పడమర ఖండ్రికలో తాతపూడి రాజేష్ శర్మ, అచ్యుతాపురంలో పలివెల మధు మాట్లాడుతూ సామాజికాభివృద్ధికై జగ్జీవన్‌రామ్ చేసిన కృషిని కొనసాగించాలన్నారు.



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీవో సుధాసాగర్

బడుగువర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

రామచంద్రపురం: స్వాతంత్య్ర సమరయోధుడు సంఘ సంస్కర్త, రాజకీయవేత్త, బీహార్లోని వెనుకబడిన వర్గాల నుంచి వచ్చి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుబడిన ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని ఆర్డీవో ఎస్.సుధాసాగర్ అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం జగ్జీవన్‌రామ్ 116వ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఆర్డీవో సుధాసాగర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పార్లమెంటులో నలభై ఏళ్ల పాటు మంత్రి పదవులు నిర్వహించడమే కాకుండా ఉపప్రధానిగా బాబూ జగ్జీవన్‌రామ్ పని చేశారన్నారు. 1935లో అంటరాని వారికి సమానత్వం కోసం అంకితమైన ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ అనే సంస్థను స్థాపించడంలో అతను కీలక పాత్ర పోషించారన్నారు. 1937లో బీహార్ శాసనసభకు ఎన్నికయ్యారని గ్రామీణ కార్మిక ఉద్యమాన్ని చేపట్టానన్నారు. కేంద్ర మంత్రి వర్గంలో కార్మిక మంత్రిగా, దేశంలో కార్మిక సంక్షేమ విధానాలకు పునాది వేశారన్నారు. జెనీవాలో జరిగిన అంతర్జాతీయ కార్మిక సంస్థ కార్మిక సదస్సుకు హాజరైన ప్రతిష్ఠాత్మక ఉన్నత స్థాయి ప్రతినిధి బృందంలో జగ్జీవన్‌రామ్ ఒకరు అన్నారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించిన రాజ్యాంగ పరిషత్ సభ్యుల్లో ఒకరన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో ఎ.శాంతి, ఆర్డీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.